
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 5 అక్టోబరు 2025





ఆటో నడుపుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యం

- తప్పనిసరిగా బీమా చేయించుకోండి
- ట్రాఫిక్ రూల్స్ పాటించండి
- 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత

విజయనగరం/ క్రైం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ఈ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగరంలోని మెసానిక్ టెంపుల్లో 'ఆటో డ్రైవర్ల సేవలో' భాగంగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేసే కార్యక్రమాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. తొలుత జడ్పీ అతిథి గృహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజుతో కలిసి ఆటోలో ప్రయాణించారు. స్వయంగా ఆటో నడిపి డ్రైవర్లను ఉత్తేజపరిచారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ, జిల్లాలో 15,417 మంది డ్రైవర్లకు గాను రూ.23 కోట్ల 21 లక్షలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఖాకీ షర్ట్ ధరిస్తే హుందాగా, గౌరవప్రదంగా, కర్తవ్య నిష్ఠతో ఉన్నట్లు ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో రోడ్లు చాలా అధ్వానంగా ఉండేవని, తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేశామని, దీంతో ఆటో డ్రైవర్లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా తిరుగుతున్నారన్నారు. ఇదే సమయంలో జాగ్రత్తలు కూడా తీసుకోవాలని, రోడ్లపై వెళ్లేటప్పుడు ఒకరిద్దరు ప్రయాణికుల కోసం అకస్మాత్తుగా ఆటోలు ఆపుతుంటారని, దీనివల్ల వెనుక వచ్చే వాహనాలు కంట్రోల్ తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఈవిషయాన్ని ఆటో డ్రైవర్లు గుర్తించాలని సూచించారు. ఆటోలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఆ బీమానే కుటుంబాలకు జీవనాధారంగా ఉంటుందన్నారు. విధుల్లో అధికారుల సూచనలు పాటించాలని, ట్రాఫిక్ రూల్స్‌ను అనుసరించాలని చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ, పైడిమాంబ పండుగ (మిగతా 8వ పేజీలో..)

బీమా, ఫిట్‌నెస్ చేయించుకుంటాను



రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు అందిస్తున్న రూ.15 వేల సాయంతో తమ కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. ఈ నగదుతో ఆటోకి బీమా, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్ చేయించుకుంటే ఏడాది పాటు ఎటువంటి ఒత్తిడి లేకుండా రోడ్డుపై ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాను. ఈ పథకంతో ఆటో కార్మికులకు ఎంతో మేలు.

- గోవిందరావు, ఆటోడ్రైవర్, తాడివాడ, డెంకాడ మండలం

ఆటో బాగుచేసుకుంటాను



కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాను. రోజుకు డీజిల్ ఖర్చులు పోనూ రూ.600 నుంచి రూ.800 గిట్టుబాటు అయ్యేది. మహిళలు ఫ్రీబస్‌లో వెళ్తుండడంతో రోజుకు రూ.500కు మించి రావడం లేదు. కుటుంబ జీవనం కష్టంగా మారింది. ఆటోకు చిన్నచిన్న మరమ్మతులు కూడా చేయించలేకపోతున్నాను. ఈ సమయంలో రూ.15 వేలు ఇవ్వడం కొండంత అండగా భావిస్తున్నాను. ఈ డబ్బులతో ఆటో బాగుచేసుకుంటాను. టైర్లు కొత్తవి కొనుక్కుంటాను.

- కాళ్ల శంకరావు, ఆటోడ్రైవర్, గంగచోళ్లపెంట, గజపతినగరం మండలం

గాలులతోనే నష్టం

- కూలిన స్తంభాలతో విద్యుత్ శాఖకు రూ.39.65 లక్షలు..
- 150 హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- 330 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలకూ కొంత నష్టం
- దెబ్బతిన్న ఎనిమిది ఇళ్లు



బొబ్బిలి ప్రాంతంలో దెబ్బతిన్న అరటి పంట

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా సృష్టించిన గాలి బీభత్సానికి జిల్లాలో విద్యుత్ శాఖకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అలాగే వరి, మొక్కజొన్న, పత్తి, అరటి, బొప్పాయి, కూరగాయలు పంటలకు కొంత నష్టం జరిగింది. దీనిపై అధికారులు నివేదికలు తయారు చేస్తున్నారు. పూర్తయిన వెంటనే ప్రభుత్వానికి అందించనున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా ఈనెల 2న గాలి బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ గాలి తీవ్రతకు చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. పంటలు నేలవాలాయి. కొన్ని పూర్తిగా ధ్వంసమ య్యాయి. విద్యుత్ శాఖకు దాదాపు రూ.39.65 లక్షల నష్టం వాటిల్లినట్లు సంబంధిత అధికారులు అంచనా వేశారు. 33 కేవీ నాలుగు స్తంభాలు, 11కేవీ 186 పోల్స్, ఎల్‌టీ పోల్స్ 267, 11 కేవీ కండక్టర్ 11.7 కిలోమీటర్లు, ఎల్‌టీ కండక్టర్ 12.71 కిలోమీటర్లు మేర నష్టం వాటిల్లింది. అలాగే గాలి ప్రతాపానికి జిల్లాలో ఎనిమిది ఇళ్లు పాక్షింగా దెబ్బతిన్నాయి. సుమారు 33.6 హెక్టార్లలో బొప్పాయి, 105 హెక్టార్లలో అరటి, 2.8 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు 316 హెక్టార్లలో వరి, 47 హెక్టార్లలో మొక్కజొన్న, 97 హెక్టార్లలో ప్రత్తి పంటలకు ప్రాథమికంగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

నష్టాలపై నివేదిక పంపాలి : కలెక్టర్ రామసుందర్ రెడ్డి

భారీ వర్షాలకు చోటుచేసుకున్న పంట నష్టాలను, రహదారులు, విద్యుత్ తదితర నష్టాలను అంచనా వేసి వెంటనే పంపాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఎటువంటి వివాదాలకు తావు లేకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించి ఖచ్చితమైన, పారదర్శకమైన అంచనాలను, వాస్తవాలను పంపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం ఉదయం కలెక్టర్ నిర్దేశించారు. జేసీ సేతు మాధవన్ పాల్గొన్నారు.



అంతటా వ్యాపారాలు

- జీఎస్‌టీని పట్టించుకోని అమ్మకందారులు
- పన్ను తగ్గినా.. ధరలో కనిపించని వ్యత్యాసం
- పాతధరలతోనే నిత్యావసరాలు, స్టేషనరీ, ఔషధాల విక్రయం
- నిరాశలో కొనుగోలుదారులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి)

'కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా ఇచ్చే ఉద్దేశంతో వివిధ రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించింది. ఈ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలి. ఈ బాధ్యతను ప్రజాప్రతినిధులు తీసుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించగా అసలు జీఎస్టీ తగ్గలేదని చాలా మంది ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులైన టీవీలు, ఫ్రిజ్‌లు, ఆటోమొబైల్స్‌కి చెందిన కార్లు, బైకులు, ధరలు తగ్గాయని అటు జీఎస్టీ అధికారులు, ఇటూ ప్రజాప్రతినిధులు తమ ప్రచారాలతో ఊదరగొడుతున్నారు. క్షేత్రస్థాయిలో చూస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన ఔషధాలు, స్టేషనరీ ఐటెమ్స్, నిత్యావసర వస్తువుల ధరలు, సిమెంట్ ధరల్లో మార్పు లేదంటున్నారు. పాత ధరలే ఇంకా కొనసాగుతున్నాయంటున్నారు. అటుజీఎస్టీ అధికారులు, ఔషధ నియంత్రణ, ఇతర సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడం లేదు. నిబంధనల ప్రకారం తగ్గినజీఎస్టీ ధరల బోర్డులను ప్రతి వ్యాపార కేంద్రం వద్ద ఉంచాలి. ఇది ఎక్కడా జరగడం లేదు. నేటికీ వ్యాపారులు నచ్చిన ధరలకే అమ్ముతున్నారు.

కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులు, స్టేషనరీ వస్తువులు, పాల ఉత్పత్తులు, ఔషధాలపై జీఎస్టీ తగ్గించింది. ఆ ప్రయోజనం విని యోగదారులకు చేరడం లేదు. ప్రభుత్వం దయచూపినా వ్యాపార వర్గాలు పాత ధరలకే విక్రయిస్తూ పన్ను తగ్గింపు ప్రయోజనాల్ని తమ జేబుల్లోకి మళ్లించుకుంటున్నాయి. ఏదైనా ఒక వస్తువుపై పన్ను పెరిగినా, ఉత్పత్తి వ్యయం స్వల్పంగా పెరిగినా, లేక రవాణా ఖర్చులు పెరిగినా, తక్షణం అమాంతం ధరలు పెంచే వ్యాపారస్థులు ప్రభుత్వం పన్నుతగ్గించి సామాన్యుడికి మేలు చేయాలని చూస్తే ఆ తగ్గింపును అమలు చేయడంలో ఆలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొత్త స్టాకు వచ్చేవరకూ పాత ధరలకే విక్రయిస్తామని చెప్పడం ఒక సాకుగా మారింది. నిజానికి పన్ను తగ్గింపు అనేది వినియోగదారుడు కొనుగోలు చేసిన తేదీ నుంచి అమలు కావాలి. మార్కెట్లో ఎక్కడచూసినా జీఎస్టీ తగ్గింపు తరువాత కూడా బస్తా సిమెంట్ ధర, ఒక కిలో పప్పు ధర, సాధారణ పెన్సిల్ ధర, జ్వరం మాత్ర ధరలో ఎలాంటి మార్పు లేదు.

- బైకులు, కార్లు, ఎల్‌ఈడీ టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గించారు. వీటికి జీఎస్టీని అమలు చేస్తున్నారు కాని సామాన్యుడికి అవసరమైన నిత్యావసర వస్తువులు, సిమెంట్ ధరల్లో ఎటువంటి వ్యత్యాసం లేదు. పాత ధరలే ఉన్నాయి.
- విద్యార్థులకు అవసరమైన పెన్సిళ్లు, ఎరైజర్లు, ఎక్సైర్‌సైజు పుస్తకాలు, క్రెయాన్స్ మ్యాపులు, చార్ట్‌లు, గ్లోబులు, కాటన్‌లు తదితర వాటిపై 12 నుంచి 0కు జీఎస్టీని కేంద్రం తగ్గించింది. అయినప్పటికీ పాత ధరలే కొనసాగుతున్నాయి. జీరో శాతం అంటే స్టేషనరీ ఐటెమ్స్ ధర చాలా వరకూ తగ్గాలి. కానీ వ్యాపారులు పట్టించుకోవడం లేదు.
- హైరాయిల్స్, బేబీ నాప్‌కిన్స్, టూత్ బ్రెష్, షేవింగ్ క్రీమ్స్ టాయిలెట్ సబ్బులు, జాము (మిగతా 8వ పేజీలో..)

ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం

- ఉత్సవాలను విజయవంతం చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

విజయనగరం/టౌన్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరపాలని, ప్రతి భక్తునికీ సులువుగా అమ్మవారి దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి పైడితల్లి పండుగ, విజయనగరం ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ శాఖ, రెవెన్యూ, దేవస్థానం వారు సంయుక్తంగా కంట్రోల్ రూం నుంచి అనుక్షణం పరిశీలిస్తుండాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, తాగునీటి సరఫరా బాగుండా లని, అంతా ప్లాస్టిక్ రహితంగా జరిగేలా చూడాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజయనగరం నగర పాలకసంస్థ కమిషనర్ పి.నల్లనయ్యకు సూచించారు. పండుగకు నలుమూలలనుంచి అధికంగా మహిళలు వచ్చే అవకాశం ఉందని, అందుకు 170 బస్సులు అవసరమవుతాయని, ఆయా రూట్లలో బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ రథాలను అనుసరించే వలంటీర్లకు, సేవా ప్రతినిధులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కలెక్టర్ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి 7వ తేదీ ఉదయం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖను ఆదేశించారు. విజయనగరం ఉత్సవాల ఏర్పాట్లపై సంయుక్త కలెక్టర్ సేతుమాధవన్ మాట్లాడుతూ 11 వేదికల్లో జరిగే కార్యక్రమాలను వివరించారు.

ఉత్సవాల వేదికలు

బొంకుల దిబ్బ: కన్యాశుల్కం, సత్యహరిశ్చంద్ర నాటకం

అయోధ్యమైదానం: 5న సాయంత్రం మ్యూజికల్ నైట్, 6న సాయంత్రం మెగా మ్యూజికల్ నైట్, 6న వివిధ రకాల జాతులతో పెట్‌షో

మహారాజా కోట: సైన్స్ ఫెయిర్, స్టాంప్ కాయిన్స్, ఎగ్జిబిషన్, ఆర్ట్ గ్యాలరీ, 5న రాత్రి 10 వరకు లేజర్‌షో

గురజాడ కళాభారతి: 5, 6 తేదీల్లో నాటకాలు

విజ్జీ మైదానం: 5, 6తేదీల్లో ఖోఖో, కబడ్డీ, షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, స్కేటింగ్ పోటీలు

ఎంఆర్ సంగీత కళాశాల: 5,6 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య పోటీలు

లేడీ రిక్రియేషన్ క్లబ్: కవి సమ్మేళనం, సాహితీ గోష్ఠి

లైన్స్ కమ్యూనిటీ హాలు: డాక్యుమెంటరీ ప్రదర్శన, జానపద నృత్యాలు, కళాకారులతో థింసా నృత్యం, స్టిక్, కత్తి పోరాటాలు, పులి వేషాలు

కోట: 6తేదీన పులివేషాల ప్రదర్శన

లోవర్ ట్యాంక్ బండ్ రోడ్డు: జాతీయ స్థాయి సరస్ మేళా

పంట నష్టానికి తగిన పరిహారం అందజేస్తాం 8


- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పాగిరిలో యువకుల హల్‌చల్

- ఒకరిపై కత్తి, కొడవలితో దాడి 8

వైసీపీ హయాంలో విధ్వంస పాలన

- గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్టు చైర్మన్ అశోక్ గజపతిరాజు



విజయనగరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంస పాలన సాగిందని, దేవాలయాలను ధ్వంసం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్, పైడితల్లమ్మ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు విమర్శించారు. శనివారం విజయన గరంలో పైడితల్లమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం కోటలో జరిగింది. ఈసందర్భంగా పాలక మండలి సభ్యులను అశోక్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు భక్తులకు సేవలందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవహరించిన కమిటీ సభ్యుల మాదిరి నిబంధనలు ఉల్లంఘించకూడదని హితవు పలికారు. సాక్షాత్తు వైసీపీ దేవదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాన్సాస్ ట్రస్ట్ వ్యవహారంలో కలగజేసుకుని అధికారులతో ఎన్నోతప్పులు చేయించారన్నారు. అలాగే అధికారులు సైతం మంత్రుల అడుగులకు మడుగులు వత్తారని, ఆలయ అధికారులు వైసీపీ మంత్రుల బూట్లను నాకారని ఘాటుగా విమర్శించారు. సంస్థ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని ప్రశ్నిస్తే తనపైనే క్రిమినల్ కేసుపెట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పటిష్ఠ బందోబస్తు

- ఎస్పీ ఏఆర్ దామోదర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పైడితల్లి సిరిమానోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిమానోత్సవానికి 2600 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ముగ్గురు ఏఎస్పీలు, 15 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు/ఆర్‌ఐలు, 150 మంది ఎస్సైలు/ఆర్‌ఎస్సైలు, 2600 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు. 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని, 70 సీసీ కెమెరాలు, దేవదాయ శాఖ తరపున 54 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సిరిమాను తిరిగే మార్గంలో ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో రూఫ్‌టాప్‌లలో కూడా పోలీసులను నియమించి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- సిరిమాను తిరిగే మార్గంలో 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ 9 ప్రాంతాల్లో అన్ని రకాల వాహనాల రాకపోకలను నిషేధించామన్నారు. వాహనాల పార్కింగ్‌కు నగరంలోని రాజీవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియం, గట్టు, ఫోర్ట్ సిటీ స్కూల్, ఎస్‌బీఎస్ నగర్, రైల్వేస్టేషన్, పెద్ద చెరువు, టీటీడీ కల్యాణ మండపం, ఎంఆర్ కాలేజీని కేటాయించామన్నారు.

డీసీసీబీలో రాజకీయాలకు తావులేదు

- చైర్మన్ కిమిడి నాగార్జున 8

ఆటోడ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం



ఆటోడ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా సమర్థవంతమైన నేత ఉంటే ఎలాంటి అద్భుతమైన పరిపాలన అందుతుందో అందరికీ అర్థమవుతోందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఏఎంసీ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీ నాయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంతో ఆటో డ్రైవర్లు నష్టపోకుండా ఉండడానికి వారికి రూ.15 వేల చొప్పున అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు, తహసీల్దారు మలపురెడ్డి శ్రీను, మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


ఆటో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

ఆటోడ్రైవర్లకు నిజమైన పండుగ..



ఎస్.కోటలో ఆటోడ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు నిజమైన పండుగ వచ్చిందని ఎమ్మెల్యే లలిత కుమారి అన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 2,735మంది ఆటోడ్రైవర్లకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు చోటు కల్పించేది టీడీపీనే..

గుర్ల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాన్య కార్యకర్తలను కూడా గౌరవించి పదవులు పొందే అవకాశం కల్పించేది తెలుగుదేశం ప్రభుత్వమని చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. శనివారం అమ్మాజీ కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సీహెచ్.మహేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కిరణ్‌కుమార్, విమలా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఎంతో మేలు..

కురుపాం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూ.15 వేల వంతున ఆర్థిక సాయం అందించడం వల్ల ఆటోడ్రైవర్లకు ఎంతో మేలు జరుగుతుందని విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆటోడ్రైవర్ల సేవలో పథకాన్ని శనివారం ఆమె కురుపాంలో ప్రారంభించారు. స్థానిక ధూళికేశ్వరస్వామి ఆలయం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గంలో గల 1347 మంది లబ్ధిదారులకు 15 వేల వంతున జమ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ కనదుర్గ, రాష్ట్ర ఎస్టీ సెల్ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ కడ్రక కళావతి తదితరులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి


ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ తదితరులు

సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం..


ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం సీఎం చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం ఆటోడ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం 150కి పైగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. స్వయంగా ఆటోను నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలో 1,531 మందికి ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కొల్ల అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, వల్లూరు గణేష్, కోటగిరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దసరా కానుక

పాలకొండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆటో, క్యాబ్, మ్యాక్సీ డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఆయన సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌తో కలిసి ప్రారం భించారు. స్థానిక కోటదుర్గమ్మ ఆలయం నుంచి సీతంపేట వరకు ఆటో స్వయంగా నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దసరా కానుకగా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఈ పథకం మంజూరు చేసిందన్నారు.

మా నాన్నా ఆటోవాలానే..

మా నాన్నగారు ఆటోవాలా అయినా తనను ఉన్నత చదువులు చదివించి ఐఏఎస్ అధికారిగా తీర్చిదిద్దారని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ అన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రూ.15 వేలు ఆర్థిక భరోసా ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎస్.మన్మథరావు, ఆర్‌టీవో టి.వేణుగోపాలరావు, టీడీ పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు గండి రామినాయుడు, గర్భాన సత్తిబాబు పాల్గొన్నారు.

క్వారీలో పేలుళ్లతో బీహార్ వాసి మృతి

పాచిపెంట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా సరిహద్దులోని బంగారుగుడ్డి సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించి క్వారీ పేలుళ్ల వల్ల ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం ప్రకారం.. బండరాళ్లను తొలగించే క్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం పేలుడు పదార్థాలు వినియోగించారు. సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఆ సమయంలో నడుచుకుని వెళ్తున్న బీహార్‌కు చెందిన కేశవ్‌కుమార్ (55) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే రాష్ట్రానికి చెందిన సూరజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ కాంట్రాక్టరు వద్ద కూలి పనిచేస్తున్నారు. సూరజ్‌కుమార్‌కు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు అందుబాటులో లేకపోవడంతో వీఆర్వో రిపోర్టు మేరకు ఎస్ఐ కె.వెంకటసురేష్ కేసు నమోదు చేశారు.

బావిలోపడి గుర్తుతెలియని వ్యక్తి..

పార్వతీపురం రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలగొడబలో ఓ బావిలో పడి గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. బావిలో పడి మృతిచెందినట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పసుకుడి వద్ద లారీ బోల్తా

భామిని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పసుకుడి సమీపంలో రాయపూర్ నుంచి విశాఖ వెళ్తున్న లారీ శుక్రవారం అర్ధరాత్రి అదుపు తప్పి బోల్తా పడింది.ఆ సమయంలో ఎటువంటి వాహనాలు రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మలుపు వద్ద లారీ అదుపు తప్పి తుప్పల్లోకి వెళ్లి పల్టీ కొట్టింది. లారీలోని బియ్యం మరో లారీలోకి ఎక్కించి విశాఖకు పంపించారు.

40 లీటర్ల సారా స్వాధీనం

పాలకొండ,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలోని జక్రగూడ జంక్షన్ సమీపంలో ఉన్న నౌగాడ-సీతంపేట రోడ్డులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తనిఖీలు నిర్వహించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆయన వద్ద 40 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

నవోదయం 2.0తో సారా నిర్మూలన

రామభద్రపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సారా నిర్మూలనకు నవోదయం 2.0 దోహదపడిందని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏఎస్ దొర తెలిపారు. శనివారం రామభద్రపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూగతనెలలో జిల్లాలో 109కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.106కోట్లు అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో 12 మద్యం కేసుల్లో పట్టుబడిన 260 క్వార్టర్ బాటిళ్లను ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏఎస్‌దొర, ఎస్ఐ వెలమల ప్రసాద్ సమక్షంలో ధ్వంసంచేశారు.వీటి విలువ రూ.33వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అప్పారావు పాల్గొన్నారు.

నాగావళికి 21 వేల క్యూసెక్కుల వరద

గరుగుబిల్లి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం ఎగువ నుంచి సుమారు 46 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రవహించగా, శనివారం 21 వేల క్యూసెక్కుల మేర రాగా, దిగువకు స్పిల్‌వే నుంచి 12,500 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు జేఈ బి.కిషోర్‌కుమార్, ఆపరేటర్ కె.రామకృష్ణ విడుదల చేశారు. ఈసందర్భంగా జేఈ మాట్లాడుతూ ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.49 మీటర్ల నీటిమట్టం ఉందని తెలిపారు. సాగునీటి అవసరాల నిమిత్తం ప్రధాన కాలువల నుంచి 920 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహణకు చర్యలు: ఆర్డీ

బొబ్బిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీలో గల 16 సచివాలయాల పరిధిలో 16 టీములను నియమించి సర్వే ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు విశాఖపట్నం పురపాలక ప్రాంతీయ సంచాలకుడు వి.రవీంద్ర తెలిపారు. మునిసిపాలిటీలు ఆర్థికంగా పరిపుష్టి అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. శనివా రం బొబ్బిలిమునిసిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి, మేనేజరు దీక్షితులు, ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి

రామభద్రపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఫ్యాప్టో నాయకులు జేసీరాజు, బొప్పె రవికుమార్, ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. శనివారం రామభద్రపురం ఎమ్మార్సీ భవనం వద్ద నిరసన తెలిపారు.కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంగాధరరావు, శంకరరావు, కేశవ, నాగభూషణం పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ నాయకురాలు విజయగౌరి పిలుపు నిచ్చారు.బొబ్బిలి మండల వనరుల కేంద్రం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలోఉపాధ్యాయుల సమస్యలపై నిరసన ప్రదర్శననిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, పోలినాయుడు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

బెలగాం, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ డిమాండ్ చేశారు. బీసీలకు సంబంధించిన ఐదు డిమాండ్లను నెరవేర్చాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేష్, జగన్మోహన్, సరస్వతి, గణేష్ పాల్గొన్నారు.

నేడు చక్రతీర్థ స్నానాలు

గరుగుబిల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో శనివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా హోమాలనునిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ మాట్లాడుతూ ఆదివారం బ్రహ్మోత్సవాలు ముగింపు పురస్కరించుకుని నాగావళితీరంలో స్వామివార్లకు శ్రీచక్ర తీర్థ స్నానాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న చలో విజయవాడ

బొబ్బిలి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి తరలిరావాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరామినాయుడు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు దాసరి వెంకటనాయుడు కోరారు. బొబ్బిలిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలపై నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా

భామిని, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ లైన్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం మధ్యాహ్నం మూడుగంటల నుంచి విద్యుత్‌లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. 33కేవీ దిమ్మిడిజోల సమీపంలో తీగలు తెగడంవల్ల సరఫరా నిలిచిపోయిందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

ఏఈని నిలదీసిన గిరిజనులు

మక్కువ రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):తమ గ్రామానికి నెల రోజులుగా విద్యుత్ సరఫరాలేదని పనసభద్ర పంచాయతీ పరిధిలో గల గుంటభద్ర గిరిజనులు శనివారం ట్రాన్స్‌కో మార్కొండిపుట్టి సబ్ స్టేషన్ ఇన్‌చార్జి ఏఈ దాసరి సింహాచలాన్ని దుగ్గేరులో నిలదీశారు.ఈసందర్భంగా గిరిజనులు మాట్లాడుతూగ్రామానికి కొత్తగా విద్యుత్‌లైన్ వేస్తామని నెలరోజుల నుంచి జాప్యం చేస్తూ పాతలైన్ నుంచి సరఫరా చేయడం లేదని తెలిపారు. సోమవారం వరకు సమయం ఇవ్వాలని ఏఈ సింహాచలం గిరిజనులను కోరారు.

చందాలు వేసుకుని శ్రమదానం

● అంటివలస రోడ్డు ఏర్పాటుచేసుకున్న గ్రామస్థులు


శ్రమదానంచేస్తున్న అంటివలస గ్రామస్థులు

మక్కువ రూరల్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మక్కువ పంచాయతీలోని అంటివలస వెళ్లే రోడ్డును గ్రామస్థులు చందాలు వేసుకుని శ్రమదానం నిర్వహించి శనివారం ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ 70 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి పక్కా రోడ్డు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లారు. ప్రభుత్వం రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులంతా ఏకమై చందాల రూపంలో కొంతనగదు సేకరించారు. ఆ డబ్బులతో శనివారం రోడ్డుపనులు ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఒంటి రామలక్ష్మి మక్కువ సర్పంచ్‌గా వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు వ్యవహరించారు.అయినా తమగ్రామానికి రోడ్డు నిర్మాణానికి మోక్షం లభించలేదని పలువురు వాపోయారు. దీంతో గ్రామస్థులు రోడ్డు ఏర్పాటుకు ముందుకొచ్చారు.

డ్రోన్లను ఉపయోగించుకోవాలి: ఏవో

గరుగుబిల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు డ్రోన్లను ఉపయోగించుకోవాలని ఏవో టి.జ్యోత్స్న తెలిపారు. శనివారం రాయిందొరవలస, పెదగుడబ పంచాయతీలపరిధిలో డ్రోన్ సహకారంలో పురుగు మందులు పిచికారీని నిర్వహించారు.

ఎకరానికి రూ. 50 వేలు ఇవ్వాలి

సాలూరు రూరల్,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు పరిహారమందించాలని రైతు సంఘం జిల్లానేత గేదెల సత్యనారాయణ కోరారు. శనివారం డొంకల వెలగవలసలో వ్యవసాయకార్మిక, గిరిజన సంఘం నేతలు మర్రి శ్రీనివాసరావు,సీదరపు అప్పారావుతో పంటనష్టాలను పరిశీలించారు.అలాగే సాలూరు,మక్కువ మండలాల్లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కోరారు. కందుపథం,తోణాంల్లో పంట నష్టాలను పరిశీలించారు.

వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి

మక్కువ రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలలను పీపీపీ విధానంలో నడిపేందుకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని మన్యం జిల్లా రైతుకూలీ సంఘంనాయకులు డిమాండ్ చేశారు. శనివారం నంద వారపు సంతలో జిల్లా రైతు కూలీసంఘం ఉపాధ్యక్షుడు పీడిక అసిరిప్రసాదు, అప్పారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.

పోషణ మాసోత్సవాలు విజయవంతం చేయండి

కురుపాం,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): పోషణ మాసోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా ఐసీడీఎస్ ప్రోజెక్టు అధికారి కనక దుర్గ కోరారు. శనివారం కురుపాంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో కురుపాం సీడీపీవో జి.రజిని దుర్గ, సూపర్‌వైజర్లు పి.జానకీ,శ్రావణి,రామలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం


బొబ్బిలి: అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుర్గాదేవి శరనవరాత్రి మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని శనివారం ఉత్సవ, ఆలయాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఉత్సవ కమిటీలు, ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

● వీరఘట్టం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం, కిమ్మి గ్రామాల్లో శనివారం దుర్గాదేవి విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ఊరేగించి నిమజ్జనంచేశారు.

● బొబ్బిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యో తి):బొబ్బిలి రావు వారి వీధిలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీరాజరాజేశ్వరి మాత విగ్రహాన్ని శనివారం రాత్రి కోటి చెరువులో నిమజ్జనం చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కురుపాం,అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు నిమ్మక జయరాజ్ కోరారు. ఈ మేరకు శనివారం గిరిజన జేఏసీ నాయకులతో కలిసి కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో జెఏసీ నాయకులు టి.రామారావు, పి.అప్పన్నదొర, లోవరాజ్,ఏ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డీలర్లపై చర్యలు తీసుకోవాలి

రామభద్రపురం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లిలో డీలర్లు సమయపాలన పాటించకపోవడంపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు భవిరెడ్డి శంకరరావు కోరారు. శనివారం ఉదయం పది గంటలైనా షాపులు తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ ఉన్న రెండు డిపోల్లో ఒక డిపో బినామీ వ్యక్తితో నిర్వహిస్తున్నారని, అలాగే బియ్యం కొలతల్లో కూడా చాలా తేడాలు చేస్తున్నారని తెలిపారు. కాగా ఈ విషయంపై విచారణ నిర్వహిస్తామని తహసీల్దార్ అజురఫీజాన్ తెలిపారు.

వీవోఏలను బలిచేయవద్దు

బొబ్బిలి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలుగు విభాగంలో గతంలో జరిగిన అవకతవకలు, అవినీతికి వీవోఏలను బలిచేయవద్దని సీఐటీయూ నాయకులు పి.శంకరరావు కోరారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపుసంఘాల రుణాల రికవరీలో జరిగిన అవినీతిలో బాధ్యులు ఏపీఎంలు, సీసీలేనని ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

స్వచ్ఛ గ్రామాల ఎంపిక

బాడంగి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆకులకట్ట, ముగడ, తెంటువలస గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా ఎంపికయ్యాయి.ఈమేరకు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఒక ప్రకటన విడుదలచేశారు.


కొమరాడ: గుంప సోమేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు కోతకు గురైన దృశ్యం


సాలూరు రూరల్: గిరిశిఖర సిరివరలో ఈదురుగాలులకు నేలకూలిన మొక్కజొన్న


గరుగుబిల్లి: నందివానివలసలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది


వీరఘట్టం:ఉధృతంగా ప్రవహిస్తున్న ఒట్టిగెడ్డ

వర్షాలతో దెబ్బతిన్న పంటలు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మూడు రోజులుగా పంట పొలాలు నీటిలోనే ఉన్నాయి. అనేకచోట్ల వరిపైరు నేలకొరిగింది. అరటి, మొక్కజొన్న పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. పలుచోట్ల రహదారులు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పంట నష్టపోయామని... ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటలను అధికారులను పరిశీలించారు. కాగా శనివారం మళ్లీ వర్షం కురవడంతో రైతుల్లో భయాందోళన నెలకొంది. మన్యం జిల్లాలో ఇంకా పలు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నేలకొరిగిన స్తంభాలు, తెగిపోయిన వైర్లు పునరుద్ధరించపోవడంతో పలు గ్రామాలు ఇంకా అంధకారంలోనే మగ్గుతున్నాయి.

\- ఆంధ్రజ్యోతి బృందం

మద్యం మత్తులో టాయిలెట్ క్లీనర్ తాగి వ్యక్తి మృతి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒక వ్యక్తి ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ తాగి మృతిచెందాడు. శనివారం జరిగిన ఈ ఘటనపై సీఐ నారాయణమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో నివాసం ఉంటున్న ముమ్మన రమణ(50) శనివారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. అనంతరం ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ తాగడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఇక్కడ వైద్యులు వెంటనే విజయనగరం మహారాజ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రమణ అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

గంట్యాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన పి.తులసి(38) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బుడనాపల్లి గ్రామానికి చెందిన తులిసి గత నెల 25న గొడియాడ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పొగిరిలో యువకుల హల్‌చల్

● ఒకరిపై కత్తి, కొడవలితో దాడి

రాజాం రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): డబ్బులు బాకీ ఉన్నందుకు ఓ యువకుడిపై ముగ్గురు యువకులు దాడి చేశారు. అడ్డు వచ్చిన మరో యువకుడిపై కత్తి, కొడవలితో దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటనపై రాజాం ఎస్ఐ రవికిరణ్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన రౌతు రాంబాబు, పొగిరి ఉపేంద్ర, బొంగు సాయి ఈనెల 3న రాత్రి పొగిరి-జి.సిగడాం మధ్య మద్యం తాగుతున్నారు. ఇదే సమయంలో తనకు లోకేశ్ రూ.3వేలు ఇవ్వాలని సాయి.. రాంబాబు, ఉపేంద్రకు తెలిపాడు. అక్కడి నుంచే లోకేశ్‌కు ఫోన్ చేశాడు. వీరు ముగ్గురున్న చోటుకు లోకేశ్ వెళ్లగా.. బాకీ చెల్లించాలని ఆ ముగ్గురు డిమాండ్ చేశారు. దీంతో లోకేశ్ తన వద్ద ఉన్న రూ.2వేలు సాయికి చెల్లించి, మిగిలిన మొత్తం చెల్లిస్తానని చెప్పి పొగిరి గ్రామంలోకి వెళ్లిపోయాడు. ఇదిలాఉంటే రాంబాబు, ఉపేంద్ర, సాయి గ్రామంలోకి వచ్చి మరోమారు లోకేశ్‌ను కొట్టే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో అక్కడే ఉన్న లోకేశ్ మిత్రుడు జడ్డు మాధవనాయుడు వివాదాన్ని నివారించేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే కత్తి, కొడవలితో దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్న ఉపేంద్ర, రాంబాబు.. మధ్యలో దూరిన మాధవనాయుడిపై దాడికి పాల్పడ్డారు. దీంతో మాధవనాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఇతనిని రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మాధవనాయుడు ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మాధవనాయుడు ఫిర్యాదు మేరకు రాంబాబు, ఉపేంద్ర, సాయిపై రాజాం ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

వివాదాలకు తెర లేపటం సమంజసం కాదు

విజయనగరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పైడితల్లమ్మ పండుగ సందర్భంగా టీడీపీ నాయకులు రాజకీయాలకు తెరలేపటం సమంజసం కాదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక జడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ ఆవరణలో కూర్చుని సిరిమాను ఉత్సవాన్ని ఎన్నో ఏళ్లగా తిలకిస్తున్నామని, ఈ ఏడాది కూడా అవకాశం కల్పించాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యానారాయణ అధికార యంత్రాంగానికి లేఖ రాశారని అన్నారు. దీనిపై డీసీసీబీ చైర్మన్ నాగార్జున అదేదో నేరం అన్నట్లుగా 'మీము అధికారంలో ఉంటే మీరు కూర్చొని సిరిమాను తిలకించటం ఏమిటి' అని ప్రశ్నించడం తగదన్నారు.

డీసీసీబీలో రాజకీయాలకు తావులేదు

విజయనగరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో రాజకీయాలకు తావులేదని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్‌గా బొత్స లేఖపై తాను స్పందించానని, పార్టీ వ్యవహారాలపై చర్చించ లేదని తెలిపారు. జడ్పీ కార్యాలయం చాంబర్‌లో పార్టీ రాజకీయాలు మాట్లాడటం తగదన్నారు. 30 ఏళ్లుగా ఆచారం ఉందనటం, అప్పటి వరకు వారి పార్టీకి చెందిన వ్యక్తులే డీసీసీబీ చైర్మన్లుగా వ్యవహరించటంతో సిరిమాను తిలకించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. 94 మంది సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ చైర్మన్‌తో కలిసి సిరిమాను తికించేందుకు ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తాము తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి మార్పులేదని, ఇక ఇంతటితో ఈ వివాదానికి స్వస్తి పలకటం మంచిదన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు 20లోగా పూర్తి చేయాలి

డెంకాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శనివారం చేపట్టిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని విజయనగరం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగభూషణ రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు ఈనెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని ఆయన సూచించారు. ఏవో టి.సంగీత, వ్యవసాయ విస్తరణాధికారి బి.రామకోటి, వీఏఏలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక భద్రతే ధ్యేయం

విజయనగరం టౌన్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ పాణిగ్రాహి అన్నారు. నగరంలోని ట్యాంకు బండ్ రోడ్డులో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌ను ఆయన శనివా రం పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో మేనేజర్ రాజ్ కుమార్, ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఆసరా



గజపతినగరం: ఆటో డ్రైవర్లకు చెక్ పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

గజపతినగరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఆసరాగా నిలిచిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా శనివారం స్థాని క టీడీపీ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆటో డ్రైవర్లు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీకన్వెన్షన్ హాల్‌లో ఏర్పా టుచేసిన సభలో ఆయన మాట్లాడారు. స్త్రీశక్తి పథకం వల్ల ఆటో కార్మికులకు నష్టం కలగకూడదని ఆలోచన తో ఏడాదికి వారి ఖాతాలో రూ.15వేలు జమ చేస్తున్న ట్టు తెలిపారు. టీడీపీ నాయకులు కొండపల్లి కొండల రావు, మాజీ మంత్రి జనసేన నాయకురాలు పడాల అరుణ, బీజేపీ నాయకురాలు రెడ్డి పావని, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, జనసేన నాయకుడు మర్రాపు సురేష్, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, ఆంధ్ర ప్రాజెక్టు చైర్మన్ సతీష్, వాహనాల తనిఖీ అధికారిణి ఎం.ఉష పాల్గొన్నారు.

● డెంకాడ: ఒక కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం సాధ్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. శనివారం డెంకాడ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆటో డ్రైవర్ల సేవ'లో కార్యక్రమంలో బంగార్రాజు పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకుందని అన్నారు. ఎంపీపీ బి.వాసుదేవ రావు, టీడీపీ భోగాపురం మండల అధ్యక్షుడు కర్రో తు సత్యనారాయణ, ఆర్డీవో ఎస్ఐ నవీన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనా రాయణ, టీడీపీ డెంకాడ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, పతివాడ తమ్మినాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర వీర మహిళ తమ్మి లక్ష్మీరాజ్, జనసేన నాయకులు పైల శంకరరావు, పనిరాజు, ప్రదీప్‌రా జు తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: ఆటో డ్రైవర్ల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన నెల్లిమర్లలో ఆటో ర్యాలీని ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పూసపాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్ గేదెల గాయత్రి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్టీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు అవనాపు సత్యనారాయణ, అట్టాడ శ్రీధర్, గురాన అసిరినాయుడు, గురాన చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. ● జామి: రాష్ట్ర ప్రభుత్వం రూ.15వేలు అందజేయడంపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం భీమసింగి శ్రీదేవి ఎల్లమాంబ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు స్వామినాయుడు, కార్యదర్శి డి.పైడిరాజు పాల్గొన్నారు. ● భోగాపురం: ఆటో డ్రైవర్లు శనివారం భోగాపురంలోని హనుమాన్ జంక్షన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు.



నెల్లిమర్ల: ర్యాలీలో మాట్లాడుతున్న టీడీపీ నేత రవిశేఖర్



భోగాపురం: పాలభిషేకం చేస్తున్న దృశ్యం



డెంకాడ: కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

పంట నష్టానికి తగిన పరిహారం అందజేస్తాం

● మంత్రి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా ఎక్కడైనా పంట నష్టం జరిగితే తగిన నష్ట పరిహారం అందజేస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం ఆయన విజయనగరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గత రెండు రోజులుగా జిల్లాలో ఈదురు గాలుల వల్ల పలు విద్యుత్ లైన్లకు నష్టం జరిగిందన్నారు. ఇప్పటికే వాటిని బాగుచేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని చెప్పారు. జిల్లాలో పంట నష్టం వివరాలను అధికారులు ప్రభుత్వానికి తెలియజేయాలని ఆయన ఆదేశించారు.

పెండింగ్ సమస్యలకు మోక్షం

ఇటీవల దత్తి గ్రామంలో సీఎం పర్యటన విజయవంతం అయ్యిందని మంత్రి అన్నారు. ఎన్నో ఏళ్లగా సార్వ గెడ్డ మినీ రిజర్వాయర్ అపరిష్కృతంగా ఉందని, సీఎం పర్యటన ద్వారా పరిష్కారం లభించిందన్నారు. జిల్లాలో సుదీర్ఘ కాలంలో పెండింగ్‌లో సమస్యలకు మోక్షం కలుగనుందని చెప్పారు.

పరిశ్రమల స్థాపనపై మిశ్రమ స్పందన

గరివిడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కుమరాం గ్రామంలో పరిశ్రమల స్థాపనపై ప్రజాభిప్రాయ సేకరణలో మిశ్రమ స్పందన లభించింది. శనివారం కుమరాం గ్రామ పంచాయతీ పరిధిలో షోభా మెటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిపాదిత ఫెర్లో ఎల్లాయిస్ పరిశ్రమ స్థాపనపై శనివారం ప్రజాభిప్రాయ సేకరణ, విచారణ నిర్వహించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్వే నెంబర్లు 136/1, 136/5, 136/5ఏలో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమకు రూ.15 కోట్ల వ్యయం అంచనా వేశారు. ఈసందర్భంగా స్థానికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొందరు పరిశ్రమ వల్ల ఉద్యోగావకాశాలు, ఆర్థికాభివృద్ధి కలుగుతుందని సమర్థించగా.. మరికొందరు మాత్రం కాలుష్యం, భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జిందాల్ నిర్వాసితుల రిలే దీక్ష

ఎస్.కోట రూరల్, అక్టోబరు 4(ఆంధ్ర జ్యోతి): జిందాల్ నిర్వాసితుల రిలే దీక్ష బొడ్డవర గ్రామంలో శనివారం 108వ రోజు కొనసాగింది. రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో వీరు మాట్లాడుతూ తమ భూములు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రిలే దీక్షలో పాల్గొన్న నిర్వాసితులు

అంతటా వ్యాపా'రూలు'

(ఐదో పేజీ తరువాయి)

కెచప్స్, శాస్, డ్రై ఫ్రూట్స్, పాల ఉత్పత్తులపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించారు కాని పెద్ద, పెద్ద మార్టుల్లో ఈ తగ్గింపు ధర అమలవుతోంది. మధ్యస్థాయి కిరణా దుకాణాల్లో ఎక్కడా తగ్గింపు ధరలు మచ్చుకైనా కానరావడం లేదు. దీంతో సగటు కుటుంబానికి పన్ను ప్రయోజనం చేకూరడం లేదు.

మందుల్లోనూ మాయాజాలం..

ఔషధాలపై 12 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించింది. అయితే మెడికల్ షాపుల యాజమానులు ధరలు తగ్గించడం లేదు. గతంలో మెడికల్ దుకాణాల్లో రూ.5 వేల మందులు కొనుగులు చేస్తే రూ.250 నుంచి రూ.600 వరకూ జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం కేంద్రం పూర్తిగా మినహాయించినా ఆ ప్రయోజనం వినియోగదారుడికి అందడం లేదు. ప్రైవేటు ఆసుపత్రులకు అనుసంధానంగా నడుస్తున్న మెడికల్ షాపుల్లో ఎంఆర్‌పీనే అమలు చేస్తున్నారు. ఆసుపత్రుల్లోనూ మెడికల్ షాపులకు జీఎస్టీ వర్తించందంటూ అధిక ధరలకు మందులు అమ్ముతున్నారు. పైగా బిల్లులు ఇవ్వడం లేదు.

అధికారులు తనిఖీలు చేయాలి..

ప్రభుత్వం జీఎస్టీ ధరలను తగ్గించడం అభినందనీయం కాని క్షేత్రస్థాయిలో ఎక్కడా తగ్గింపు ధరలు అమలు కావడం లేదు. ముఖ్యంగా నిత్యావసర సరుకులైన పాల ఉత్పత్తులు, స్టేషనరీ ఐటెమ్స్, ఔషద ధరలు, సిమెంట్ ధరలు తగ్గించినా క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదన్నదే అసలు ప్రశ్న. జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారస్థుల జేబులు నిండుతున్నాయ్ తప్ప సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూరడంలేదు. దీనిపై సంబంధిత శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కఠినంగా వ్యవహరించాలి.

- సత్తి అచ్చిరెడ్డి, వినియోగదారుడు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

సీజీఎస్టీ చట్టం సెక్షన్ 171 ప్రకారం జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనం తక్షణమే వినియోగదారుడికి అందజేయాలి. జీఎస్టీ తగ్గింపు ధరలు చెబుతూ ప్రతి వ్యాపారస్థుడు బోర్డులను బయట డిస్‌ప్లే చేయాలి. తగ్గింపు ధరలను ఎవరైనా అమలు చేయకపోతే ఫిర్యాదు చేయాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. వాట్సాప్ నంబర్ 88000 01915కు కూడా ఫిర్యాదు చేయవచ్చు.

- నిర్మలాజ్యోతి, డిప్యూటీ కమిషనర్, వాణిజ్య పన్నులశాఖ, విజయనగరం

అరకొర సభ్యులతో మండల సమావేశం

రేగిడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహించిన రేగిడి మండల సర్వసభ్య సమావేశం అరకొర సభ్యులతో సాగింది. ఈ సమావేశానికి సభ్యులు కాని వారిని ఎంపీడీవో శ్యామలా కుమారి అనుమతించలేదు. దీంతో సభలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అలాగే పలు కీలక శాఖలకు చెందిన అధికారులు కూడా గైర్హాజరయ్యారు. పాలకొండ-రాజాం ప్రధాన రహదారి మరమ్మతులకు నిధుల మంజూరై రెండేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ జాప్యం చేస్తుండడంపై వైస్ ఎంపీపీలు జగన్మోహనరావు, అచ్చెంనాయుడు తోపాటు అప్పాపురం, ఆమదాలవలస, పాత చెలిగాన వలస సర్పంచ్‌లు ఆ శాఖ ఏఈ సతీష్‌ని నిలదీశారు. దీనిపై ఏఈ నీళ్లు నమలగా, కాంట్రాక్టర్‌పై చర్యలు కోరుతూ సభ్యులు తీర్మానం చేశారు. ఈ రోడ్డును తక్షణమే పూర్తిచేయకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. చిన్నశిర్లాం లైన్‌మన్ ప్రజలకు అందుబాటు ఉండటంలేదని ఆ గ్రామ సర్పంచ్ ఉమాపాపినాయుడు సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ సమస్యలపై ఏఈ సురేష్‌ను సభ్యులు ప్రశ్నించారు.

రసాభాసగా గ్రామసభ

ఎస్.కోట రూరల్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ముందుగా సర్పంచ్ సోలుబొంగు దారప్ప ఆధ్వర్యంలో కార్యదర్శి రామునాయుడు తీర్మానాలు చదివి వినిపించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గత 18 ఏళ్ల కిందట జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం భూములు ఇచ్చి, ప్రస్తుతం కూలీలుగా మారామన్నారు. తమ భూములు ఇప్పించాలని, ఎంఎస్ఎంఈ పార్కులపై స్పష్టత ఇవ్వాలని కోరారు. దీంతో గొడవ మొదలయింది. పోలీసులు వారికి సర్దిచెప్పారు. ఈ విషయంపై సర్పంచ్ మాట్లాడుతూ జిందాల్ విషయం, ఎంఎస్ఎంఈపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహిస్తామని చెప్పారు. అయితే జిందాల్, ఎంఎస్ఎంఈ వివరాలు మినిట్స్ బుక్‌లో నమోదు చేయలేదని యువత తెలిపారు. దీనిపై కార్యదర్శి వివరణ కోరగా సర్పంచ్ చెబితే నమోదు చేస్తామన్నారు.

అందుబాటులో వ్యాక్సిన్లు

కొత్తవలస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు తమ పీహెచ్‌సీలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వియ్యంపేట, కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాలకృష్ణ, సీతల్ వర్మ తెలిపారు. శనివారం వీరు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కుక్క కాటు బాధితులు ఎక్కువ అవుతున్నారని అన్నారు. తమ రెండు పీహెచ్‌సీలలో కుక్క కాటుతోపాటు పాము కాటుకు కూడా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

'పోరుబాట'ను విజయవంతం చేయండి

వంగర, రేగిడి, రాజాం, నెల్లిమర్ల, శృంగవరపుకోట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 7న విజయవాడలో చేపట్టనున్న పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. ఈసందర్భంగా శనివారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలోని పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



రాజాం: బైకు ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

ఆటోడ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యం

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందించిందని, పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆమె కోరారు. తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో రూ.15 వేల ఆర్థిక సాయం అందించడం ఎంతో శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, రవాణా ఉపకమిషనర్ మణికుమార్, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, ఎంవీఐలు మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఉత్సవాలకు విరాళం

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాల నిర్వహణ కోసం క్రెడాయ్ ప్రతినిధి బృందం రూ.7లక్షలు 10వేలు విరాళంగా అందజేసింది. ఈసందర్భంగా సంఘ ప్రతినిధులు కె.సుభాష్‌చంద్రబోస్, సురేంద్ర, రాజశేఖర్‌లను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన కార్యాలయంలో శనివారం అభినందించారు.

మంత్రి ఓఎస్‌డీగా శ్రీధర్ రాజా

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఓఎస్‌డీగా శ్రీధర్ రాజాను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీధర్ రాజా గతంలో డీపీవో, జడ్పీ సీఈవోగా, ఎంపీడీవోగా పని చేశారు.

తాగునీటి కష్టాలు తీర్చండి

డెంకాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి తులసి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించగా.. ప్రజలు, నాయకులు అనేక సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో తాగునీటికి ప్రజలు అనేక ఇబ్బందులు పడు తున్నారని, ట్యాంకులు పాడయ్యాయని, జల జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు అందడం లేదని తెలిపారు. మురుగునీటి కాలువలో తాగునీటి పైపులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

కొత్తవలస, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రులు ముగింపు సందర్భంగా శనివారం ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి 500మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాజన్న దగ్గర నుంచి ప్రస్తుతం ఆయన మనుమడు మోహన్ వరకు ఇదే సంప్రదాయం కొనసాగించడం ఆనందదాయకమన్నారు.

ఘనంగా దుర్గమ్మ నిమజ్జనం

దేవీ శర్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను భారీగా ఊరేగించారు. ఈ శోభాయాత్రలో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

(ఆంధ్రజ్యోతి బృందం)



సంతకవిటిలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఇన్‌సెట్‌లో అమ్మవారు



గుర్ల: ఊరేగింపులో మహిళల కోలాటం



ఎస్.కోట: పట్టణంలో..

జల దిగ్బంధంలో గ్రామాలు

రేగిడి, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఎగువన పడిన వర్షాలకు నాగావళి నది ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని ఆకులోవకట్ట గెడ్డ, సాయన్న గెడ్డల్లోకి శనివారం వరద నీరు చేరింది. దీంతో రేగిడి, వెంకమ్మపేట గ్రామాలు జల దిగ్బంధం అయ్యాయి. రేగిడిలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నీరు చేరింది. ఇక్కడ కాజ్‌వేపై నీరు ప్రవహించడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం నీరు తగ్గుముఖం పట్టింది.



రేగిడి: వెంకమ్మపేట గ్రామంలోకి చేరిన నీరు

అరటి పంటకు నష్టం

గంట్యాడ, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షం, గాలి బీభత్సానికి మండలంలోని 36 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే సిరిపురం రెవెన్యూ పరిధిలో దాదాపు 10 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

వేపాడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు వరి పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. కరకవలస పంచాయతీ కొత్తమారిక గ్రామానికి చెందిన గెమ్మెల శోభన్‌బాబు వరి పంటతో పాటు చాలా మంది రైతుల పంటలు పోయాయని.. వారిని ఆదుకోవాలని ఆయన కోరారు.